క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత



మహేష్ కుటుంబ సభ్యులకు ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చండూరు(గట్టుప్పల): గట్టుప్పల మండలం పరిధిలోని తేరట్‌పల్లి గ్రామానికి చెందిన మహేష్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం మహేష్ సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సహకారంతో రూ.2.50లక్షలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్ఓసీ)ని ఆదివారం ఎమ్మెల్యే హైదరాబాద్‌లోని తన నివాసంలో లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

టీయూడబ్ల్యూజే నియోజకవర్గ కమిటీ ఎన్నిక



శ్రీనివాసరెడ్డి, అధ్యక్షుడు

నల్లగొండ టౌన్: టీయూడబ్ల్యూజే (143) నల్లగొండ నియోజకవర్గ నూతన కమిటీని ఆదివారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా వంగాల శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దండెంపల్లి రవికుమార్‌గౌడ్ ఎన్నికయ్యారు. అదే విధంగా ఉపాధ్యక్షులుగా కంచనపల్లి శేఖర్, జాజాల కృష్ణ, ఉబ్బని సైదులు, ఉయ్యాల లింగయ్య, కార్యదర్శులుగా పెద్దగోని మధు, లేదండ సత్యం, చింత యాదయ్య, పోగుల రమేష్, ఈసీ మెంబర్లుగా బైరోజు మహేష్, తక్కెలపల్లి శ్యాం, పాలకూరి లింగస్వామి, మహేశ్వరం రాంప్రసాద్ ఎన్నికయ్యారు. అనంతరం నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను పలువురు జర్నలిస్టులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు గుండగోని జయశంకర్‌గౌడ్, రాష్ట్ర నాయకుడు మామిడి ప్రసాద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ ఉద్యమానికి నిదర్శనం అంశాల స్వామి



అంశాల స్వామి తండ్రిని పరామర్శిస్తున్న జనసేన నాయకుడు రవీందర్‌రెడ్డి

మర్రిగూడ: ఫ్లోరోసిస్ ఉద్యమానికి నిలువెత్తు నిదర్శనం అంశాల స్వామి అని జనసేన పార్టీ మునుగోడు నియోజకవర్గ కోఆర్డినేటర్ గోగుల రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని శివన్నగూడేనికి వెళ్లి అంశాల స్వామి చిత్రపటానికి నివాళులర్పించి, అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట చంద్రకాంత్, శివ, కిరణ్, ప్రవీణ్, పాండు, శ్రీకాంత్, వంశీ, శంకర్, వెంకటేష్, సిరాజ్ తదితరులు ఉన్నారు.

ఎస్ఐపై ఎస్పీకి ఫిర్యాదు

నకిరేకల్: భూమి హద్దుల విషయంలో తనను అకారణంగా కొట్టిన నకిరేకల్ ఎస్ఐ గోపికృష్ణపై చర్యలు తీసుకోవాలని మండలంలోని మర్రూరు గ్రామానికి చెందిన కుర్ర సతీష్ ఆదివారం జిల్లా ఎస్పీ అపూర్వరావుకు ఫిర్యాదు చేశాడు. తనకు న్యాయం చేసి భూమి హద్దులను సరిచేయాలని కోరారు.

నేడు వరద కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన

నల్లగొండ టూటౌన్: పట్టణంలో వరద కాల్వల నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు మిర్యాలగూడ రోడ్డులోని మహాలక్ష్మి రెసిడెన్సీ వద్ద, ఉదయం 10.30 గంటలకు 25వ వార్డు పరిధిలోని సాగర్ క్రాస్‌రోడ్డు వద్ద, ఉదయం 11 గంటలకు 32వ వార్డు రాక్‌హిల్స్ కాలనీలోని ఐస్‌క్రీం ఫ్యాక్టరీ వద్ద శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మొత్తం రూ.6కోట్లతో వరద కాల్వల నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

కేతేపల్లి: మండలంలోని ఇనుపాముల గ్రామంలో శ్రీపచ్చల పార్వతీ సోమేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.6.50 కోట్లు మంజూరు చేయటం పట్ల ఆలయ కమిటీ చైర్మన్ కానుగు యాదగిరి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం కేతేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిధుల మంజూరుకు సహకరించిన రాష్ట్ర మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, కేతేపల్లి జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతాసురేష్, బీఆర్ఎస్ నాయకులు, ఆలయ ధర్మకర్తలు చల్ల క్రిష్టారెడ్డి, కె.సైదిరెడ్డి, డి. నాగేశ్వరావు, పాశం లలితాప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులకు తప్పని తిప్పలు

- పింఛన్ కోసం మూడు కి.మీ. కాలినడకన వెళ్తున్న జక్కలవారిగూడెం వాసులు
- తమ గ్రామంలోనే పెన్షన్‌లు ఇవ్వాలని కోరుతున్న లబ్ధిదారులు
- అధికారులు స్పందించాలని వేడుకోలు



పెన్షన్లు తీసుకునేందుకు మునుగోడుకు వెళ్తున్న జక్కలవారిగూడెం వృద్ధులు

మునుగోడు: మండలంలోని జక్కలవారిగూడెం పెన్షన్‌దారులు ప్రతి నెలా ప్రభుత్వం వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు అందజేసే ఆసరా పెన్షన్లు తీసుకునేందుకు నానా తిప్పలు పడుతున్నారు. జక్కలవారిగూడెం గ్రామం నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటైనప్పటికీ మండల కేంద్రమైన మునుగోడుకు వెళ్లి పెన్షన్‌లు తీసుకోవాల్సి వస్తుందని పింఛన్ లబ్ధిదారులు వాపోతున్నారు. కనీసం మండల కేంద్రానికి వెళ్లేందుకు బస్సు సౌకర్యం కూడా లేకపోవడంతో పడరాని పాట్లు పడుతున్నారు. గ్రామ సర్పంచ్, ఇతర నాయకులు తమ గ్రామంలోనే పెన్షన్‌దారులకు పింఛన్ ఇవ్వాలని అనేకమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడు కిలోమీటర్లు కాలినడకన..

గతంలో జక్కలవారిగూడెం గ్రామం మునుగోడు గ్రామపంచాయతీ పరిధిలో ఉండగా దానిని ప్రభుత్వం నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసింది. కానీ ఆ గ్రామానికి నేటికీ గ్రామపంచాయతీ భవనం కూడా నిర్మించలేదు. కనీసం ఆ గ్రామంలోని పెన్షన్‌దారులకు గ్రామంలో పెన్షన్ డబ్బులు ఇవ్వకపోవడంతో గతంలో మాదిరిగా మూడు కిలోమీటర్లు కాలినడకన మునుగోడుకు వెళ్లి పింఛన్ తెచ్చుకుంటున్నారు. జక్కలవారిగూడెం గ్రామంలో మొత్తం 60మంది పెన్షన్‌దారులు ఉన్నారు. అందులో వృద్ధులు 45 మంది, వికలాంగులు ఆరుగురు, 9 మంది వితంతువులు ఉన్నారు. వితంతువులను మినహాయిస్తే వృద్ధులు, వికలాంగులు మునుగోడుకు వెళ్లి పెన్షన్ తీసుకునేందుకు అనేక అవస్థలు పడుతున్నారు. కొందరు తమ కొడుకుల సహాయంతో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, మరికొందరు ప్రత్యేకంగా రూ.200 ఖర్చు చేసి ఆటో కిరాయికి తీసుకొని వెళ్తున్నారు. మరికొంత మంది వృద్ధులు కిరాయి డబ్బులు చెల్లించలేక కాలినడకనే వెళ్లి పెన్షన్ తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ప్రతి నెలా పెన్షన్ డబ్బులు జక్కలవారిగూడెం గ్రామంలోనే ఇచ్చేలా చొరవ చూపాలని గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవట్లేదు



మా గ్రామంలోని పెన్షన్ దారులకు పెన్షన్ డబ్బులు మా గ్రామంలోనే ఇవ్వాలని అనేకమార్లు అధికారులకు వినతులు అందించా. కానీ ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకోలేదు. పేరుకే మా గ్రామాన్ని గ్రామపంచాయతీగా చేశారు. కనీసం గ్రామపంచాయతీ భవనం కూడా లేదు. మా గ్రామం నుంచి బస్సు సౌకర్యం లేక వృద్ధులు మూడు కి.మీ. కాలినడకన మునుగోడుకి వెళ్లి పెన్షన్ డబ్బులు తెచ్చుకోవాల్సి వస్తుంది.

– జక్కలి శ్రీను, సర్పంచ్, జక్కలవారిగూడెం

మా గ్రామంలోనే ఇవ్వాలి



నాకు ప్రతి నెలా ఇచ్చే పెన్షన్ డబ్బులను మూడు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి మునుగోడులోనే తీసుకుంటున్నాను. అవే డబ్బులు మా గ్రామంలో ఇస్తే బాగుండేది. చేతకానప్పుడు ఆటోలో మునుగోడుకు వెళ్తే రాను పోను కిరాయి రూ.200 అవుతుంది. ఇప్పటికైనా మాపై దయ తలచి పెన్షన్ డబ్బులు మా గ్రామానికి వచ్చి ఇస్తే సంతోష పడతాం.

– జక్కల మల్లయ్య, పెన్షన్ లబ్ధిదారుడు, జక్కలవారిగూడెం

దేశాభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యం

- నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



గోరెంకలపల్లిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి

నకిరేకల్: తెలంగాణలో అమలయ్యే ప్రతి సంక్షేమం పథకాన్ని దేశమంతా విస్తరించాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ మండలంలోని గోరెంకలపల్లి గ్రామంలో రూ.26 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో వ్యవసాయం సుభిక్షంగా మారిందన్నారు. ప్రస్తుతం కేసీఆర్ కేంద్ర ప్రభుత్వంపై యుద్ధ చేస్తున్నారని అన్నారు. తెలంగాణలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఢిల్లీలో కూడా ప్రవేశపెడతామని అక్కడి సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించడం కేసీఆర్ పాలనా దక్షతకు నిదర్శనమన్నారు. గోరెంకలపల్లి నుంచి మోదినిగూడెం వరకు బీటీ రోడ్డు కోసం రూ.1.50 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ గ్రామంలో అభివృద్ధి పనుల కోసం మరో రూ.25 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాద ధనలక్ష్మీనగేష్, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి, స్థానిక సర్పంచ్ చెట్టిపల్లి జానయ్య, పీఏసీఎస్ చైర్మన్ పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, నాయకులు చారి, రాచకొండ వెంకన్నగౌడ్, గుర్రం గణేష్, చౌగోని సైదులు పాల్గొన్నారు.

పీఠాధిపతులకు ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న మహిళలు

నకిరేకల్: పట్టణంలోని శ్రీమద్భగవద్గీత మందిరం 25వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ పరమాత్మానందగిరి స్వామి, త్రిదండి శ్రీమన్నారాయణ అష్టాక్షరీ జీయర్ స్వామి, శంకరానందగిరి స్వామి, తదితరులు ఆదివారం రాత్రి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాయలయానికి చేరుకున్నారు. వారికి వివిధ ఆలయాల చైర్మన్లు ఘన స్వాగతం పలికారు. వారిని నకిరేకల్ పుర వీధుల గుండా మహిళల కోలాటాల నడుమ ఊరేగించి గీతా మందిరానికి తీసుకొచ్చారు. వారికి స్వాగతం పలికిన వారిలో గీతా మందిర అధ్యక్షురాలు వీర్లపాటి జయమ్మఅంతయ్య, కార్యదర్శి మిట్టపల్లి యాదగిరి, కోశాధికారి వీర్లపాటి జానయ్య, శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ బోనగిరి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఉచిత కోచింగ్‌కు అనూహ్య స్పందన



ఉచిత కోచింగ్ పరీక్ష రాస్తున్న ఉద్యోగార్థులు

నల్లగొండ టూటౌన్: టీఎస్‌పీఎస్సీ గ్రూప్–4 పరీక్షకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ఇవ్వడానికి ఆదివారం నల్లగొండ పట్టణంలోని ఎలిమినేటి మాధవరెడ్డి పోలీస్ ఆడిటోరియంలో నిర్వహించిన ఎంట్రెన్స్ పరీక్షకు అనూహ్య స్పందన లభించింది. ఈ పరీక్షకు 300 మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. ఎంట్రెన్స్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు 50 రోజుల పాటు గ్రూప్–4లో ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యామ దయాకర్, మాజీ కౌన్సిలర్ దుబ్బ అశోక్‌సుందర్, అయితగాని స్వామిగౌడ్, కంచరకుంట్ల గోపాల్‌రెడ్డి, పాదూరి ఇంద్రసేనారెడ్డి, మునాసు వెంకన్న, అమరేంద్రమోహన్, రాంప్రసాద్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామంలో గల ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి, 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్లలో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాగిణి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 15 వరకు విద్యార్థులు https://telanganams.cgg.gov.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 16న మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష ఉంటుందని, హాల్ టికెట్లను ఏప్రిల్ 8వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. 6వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు ఏప్రిల్ 18 నుండి 30 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాలను పాఠశాలలో సమర్పించాలన్నారు. మెరిట్ జాబితాను మే 15న పాఠశాల నోటీసు బోర్డుపై పెట్టడం జరుగుతుందని, మే 22న జిల్లా ఉన్నతాధికారుల పరిశీలన జరుగుతుందని, మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు పొందిన విద్యార్థుల జాబితాను మే 24న మోడల్ స్కూల్ నోటీసు బోర్డుపై ప్రకటించడం జరుగుతుందన్నారు. సీట్లు పొందిన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన మే 25 నుంచి 31 వరకు కొనసాగుతుందన్నారు. పూర్తి వివరాలకు పాఠశాలలో లేదా, సంబంధిత వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతులు



కొరటికల్-రేగట్టె రోడ్డుపై మట్టి పోయించిన బీజేపీ నాయకుడు బీరప్ప

మునుగోడు: మండలంలోని కొరటికల్ గ్రామం నుంచి నల్లగొండ మండలంలోని రేగట్టె గ్రామానికి వెళ్లే మూడు కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో ఈ రోడ్డు గుండా వెళ్లే రైతులు, ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని అనేకమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా స్పందన లేదని రైతులు వాపోయారు. ఈ విషయం తెలుసుకున్న కొరటికల్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు మందుల బీరప్ప శనివారం తన సొంత ఖర్చులు రూ.50వేలతో ఈ రోడ్డుపై మట్టిని పోయించి చదును చేయించారు. దీంతో బీరప్పకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో ఉరుమడ్ల జెడ్పీహెచ్ఎస్ 1997-98 బ్యాచ్



కట్టంగూర్ జెడ్పీహెచ్ఎస్ 1987-88 బ్యాచ్

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల జెడ్పీహెచ్ఎస్ 1997–98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం చిట్యాల శివారులోని ఓ హోటల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన హెచ్ఎం లక్ష్మీనర్సింహారావు, ఉపాధ్యాయులు కుకుడాల గోవర్ధన్, కంచనపల్లి నారాయణ, లింగాచారిని ఘనంగా సన్మానించారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పల్లపు బుద్ధుడు, డాక్టర్ నర్సింహ, ఐతరాజు లక్ష్మణ్, పోలోగోని నరేష్, ఉయ్యాల చంద్రశేఖర్, కుంభం ప్రభాకర్, గోపగోని మహేశ్వరీ, ఉయ్యాల సంధ్యారాణి, సంపూర్ణ, వసంత, అనిత, మంగమ్మ, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూర్ జెడ్పీహెచ్ఎస్ 1987–88 బ్యాచ్..

కట్టంగూర్: కట్టంగూర్ జెడ్పీహెచ్ఎస్ 1987–88 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని వైవీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. 35ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని చిన్ననాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్య బోధించిన గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దశరథరెడ్డి, రమాదేవి, సుజాత, కత్తుల శంకర్, విద్యాసాగర్, పూర్వ విద్యార్థులు ఆదిమూలం శ్రీనివాస్, నిమ్మనగోటి సైదులు, కోమటి దశరథ, గంజి దుర్గాప్రసాద్, రాపోలు వెంకటేశ్వర్లు, మీలా ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

నిడమనూరు జెడ్పీహెచ్ఎస్ 1988–89 బ్యాచ్

నల్లగొండ: నిడమనూరు జెడ్పీహెచ్ఎస్ చెందిన 1988–89 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం నల్లగొండ పట్టణంలోని డీవీకే రోడ్డులో గల క్లాసిక్ రెస్టారెంట్‌లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు యుగేంధర్‌రెడ్డి, కుబేరుడు, రంగారెడ్డి, నర్సింహను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గణపురం భీమయ్య, శ్రీరాములు, వెంకట్‌రెడ్డి, కృష్ణ, మోహన్, కృష్ణకుమార్ ఉపేంద్రాచారి, ఆనంద్ జ్యోతి, సీత, శారద, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

కంచనపల్లి జెడ్పీహెచ్ఎస్ 1979–80 బ్యాచ్..

నల్లగొండ రూరల్: మండలంలోని కంచనపల్లి జెడ్పీహెచ్ఎస్ 1979–80 బ్యాచ్ 7వ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. బ్యాచ్‌లో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారి పిల్లల చదువులకు అందరూ కలిసి ఆర్థిక చేయూత ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో రాఘవరెడ్డి, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సత్తిరెడ్డి, జయచంద్రరెడ్డి, వందనం శ్రీనివాస్, వీరప్ప, వసంతరావు, రాణి, సుజాత, సునీత, వనజ, వరమ్మ, చంద్రకళ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



నిడమనూరు జెడ్పీహెచ్ఎస్ 1988-89 బ్యాచ్



కంచనపల్లి జెడ్పీహెచ్ఎస్ 1979-80 7వ తరగతి బ్యాచ్

ఘనంగా రథోత్సవం



పూజలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మర్రిగూడ: మండలంలోని వట్టిపల్లి శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి రథోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాంపల్లి మండల రైతు బంధు సమితి కన్వీనర్ ఎడుదొడ్ల రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, సర్పంచ్ కల్లు స్వాతీనవీన్‌రెడ్డి, నూన్సావత్ బిచ్చునాయక్, పందుల పాండు, పందుల కృష్ణ, ఎడ్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న చల్లమల్ల..

రామలింగేశ్వరస్వామి రథోత్సవం సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చల్లమల్ల కృష్ణారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ ముద్దం నర్సింహాగౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సిరిపంగి శ్రీనివాస్, బేత వెంకటేష్, మాదగోని కృష్ణయ్య, మాదగోని శ్రీను, సిద్ధపురం జంగయ్య, ఇబ్రహీం, విష్ణు, జీవన్ తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న చల్లమల్ల కృష్ణారెడ్డి

ఉగాది లోపు మిర్యాలగూడను జిల్లాగా ప్రకటించాలి

మిర్యాలగూడ అర్బన్: ఉగాది పండుగలోపు మిర్యాలగూడను జిల్లాగా ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక అమర వీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన జిల్లా ఉద్యమకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఏర్పాటుకు కావలసిన అన్ని అర్హతలు మిర్యాలగూడకు ఉన్నాయని, ప్రజల ఆకాంక్ష ప్రజల్లో బలంగా ఉందని ముఖ్యమంత్రి చొరవ తీసుకుని జిల్లా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు ప్రభుత్వం ఒత్తిడి తేవాలని కోరారు. జిల్లా ఏర్పాటు ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, జిల్లా ఏర్పాటుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం కరాటే విద్యార్థులకు జిల్లా ఏర్పాటు ఆవశ్యకతపై అవగాహనప కల్పించారు.

కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటాం

మిర్యాలగూడ: ఆపదలో ఉన్న బీజేపీ కార్యకర్తల కుటుంబాలను పార్టీ ఎల్లవేళలా ఆదుకుంటుందని పార్టీ రాష్ట్ర నాయకురాలు, సినీ నటి కవిత అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు చిర్ర సాంబమూర్తి కుమార్తె తపస్వి బోన్ కేన్సర్‌తో బాధపడుతుండగా ఇటీవల మండలంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో విషయం తెలుసుకున్న కవిత పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన బండి సంజయ్ పాప చికిత్సకు అవసరమైన ఆర్థిక సాయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. దీనిలో భాగంగా హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తపస్వి చికిత్స కోసం రూ.4లక్షలను పాప కుటుంబ సభ్యులకు కవిత అందజేశారు. అనంతరం పాప ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న పల్లె రవికుమార్

మర్రిగూడ: మండలంలోని మేటిచందాపురం గ్రామ మాజీ సర్పంచ్ గంట నర్సింహ అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న నామాపురం ఎంపీటీసీ ఉరిపక్క సరితానగేష్, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె రవికుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చల్లమల్ల కృష్ణారెడ్డి తదితరులు ఆదివారం నర్సింహ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో చెరుకు లింగంగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, ఎండీ. హుస్సేన్, లక్ష్మీనర్సింహ, జాల వెంకన్న, ముద్దం నర్సింహ, సిరిపంగి శ్రీను, ఇబ్రహీం, జంగయ్య, జీవన్, విష్ణు తదితరులు ఉన్నారు.

యోగాతో ఆలోచనా శక్తి మెరుగవుతుంది

మిర్యాలగూడ టౌన్: నిత్యం యోగా చేయడం వలన విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గి ఆలోచనా శక్తి పెరుగుతుందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ ఆధ్వర్యంలో యోగా ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హౌసింగ్ బోర్డులోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ వారు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం వలన పిల్లల్లో శారీరక, మానసిక ఒత్తిడి తగ్గి జ్ఞాపకశక్తిని పెంపొందించుకుంటారన్నారు. పాఠశాలల్లో యోగాను సిలబస్‌గా చేర్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎం. బాలాజీనాయక్, వార్డు కౌన్సిలర్ డి. రవినాయక్, సోషల్ ఆర్గనైజర్ మునీర్, పాఠశాల హెచ్ఎం జయరాజన్ తదితరులున్నారు.

యువత దేశభక్తిని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

దేవరకొండ : యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యకారిణి సభ్యుడు అన్నదానం సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం దేవరకొండ పట్టణంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో విరాట్ హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ముందుగా పట్టణంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు రూట్ మార్చ్ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందూవులందరూ సంఘటితం అయినప్పుడే దేశం, ధర్మం నిలబడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గోపిరెడ్డి అనీల్‌రెడ్డి, నల్లగొండ విభాగ్ సంఘచాలక్ వెంకటయ్య, నగర సంఘచాలక్ సుదర్శన్, జిల్లా కార్యవహ జనార్ధన్, జిల్లా సహ కార్యవహ శేఖర్, సంతోష్‌రెడ్డి, శ్రావణ్, నాగరాజు, రాజశేఖర్, ప్రవీణ్, గణేశ్ పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నాయకుడు మహమూద్ మృతి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తదితరులు

మిర్యాలగూడ అర్బన్ : సీపీఎం సీనియర్ నాయకుడు ఎండీ.మహమూద్(65) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందాడు. ఆయన మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ఆయన నివాసానికి చేరుకుని సంతాపం ప్రకటించారు. మహమూద్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీపీఎం అభివృద్ధికి మహమూద్ చేసిన సేవలు మరువలేనివని, విద్యార్థి దశ నుంచే ఎర్రజెండా బాటలో నడిచారని విద్యార్థి నాయకుడిగా, కౌన్సిలర్‌గా ఆయన చేసిన సేవలు గుర్తు చేశారు. పరామర్శించిన వారిలో పార్టీ నలగొండ, సూర్యాపేట జిల్లాల కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మల్లు నాగార్జున, రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జగదీష్‌చంద్ర, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, కౌన్సిలర ఎంఎ.ఘని, రామ్మూర్తి, పరుశ రాములు, ఆయూబ్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన లక్ష్మీనర్సింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని మేడారంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరిరోజున తెల్లవారుజామున రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు. చివరి రోజున నిత్య హోమం, మహాపూర్ణాహుతి, దేవతోద్వాసన, పవళింపు సేవతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోషంరెడ్డి హనుమారెడ్డి, ఆలయ ధర్మకర్త తెరటిపల్లి విఠల్, సర్పంచ్ కాలుసాని అరుణప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ నక్కరాములు, సూర్యనారాయణమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.